క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బాధితురాలికి బీమా సొమ్మును అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ ఈశ్వరరావు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల పంచాయతీ బొంజంగి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గిరిజనుడి కుటుంబానికి శనివారం వైఎస్సార్ బీమా కింద రూ.10వేల నగదును సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్య కొండంనాయుడు అందజేశారు. బొంజంగి గ్రామానికి చెందిన కోరాబు మత్స్యలింగం నాయుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం ద్వారా నగదును మంజూరు చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిగిలిన బీమా సొమ్మును బాధిత నామినీ బ్యాంకు అకౌంట్‌కు సొమ్మును త్వరలో జమచేస్తోందన్నారు. సాయి, రాజుబాబు తదితరలు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని పరామర్శించిన ట్రైకార్ చైర్మన్



మాజీ మంత్రి బాలరాజును పరామర్శిస్తున్న ఏపీ ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

సాక్షి,పాడేరు: అనారోగ్యంతో విశాఖపట్నం ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజును శనివారం ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పరామర్శించారు. బాలరాజు ఆరోగ్య పరిస్థితిని ఆయన కుమార్తె జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. మనోధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. యువజన విభాగం పాడేరు పట్టణ ప్రధాన కార్యదర్శి డి.పి.రాంబాబు ఉన్నారు.

సమయపాలన తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజీ

అనంతగిరి: మండలంలోని కొండిబ, నడిమివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో బాలాజీ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, రామకృష్ణ, కొండిబ వెల్ఫేర్ అసిస్టెంట్ సర్వాపు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తులు



ప్రిన్సిపాల్ రాజారావు

చింతపల్లి: స్థానిక ఆర్ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై వివిధ ట్రేడుల్లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగస్టు 3న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9866108607 9494377833 నంబర్లలలో సంప్రదించాలని సూచించారు.

మండల సమావేశం రేపు

హుకుంపేట: మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటరావు శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశపు మందిరంలో నిర్వహించే ఈ సమావేశంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన వివిధ శాఖల అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు,అధికారులు ఉదయం 10గంటలకు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వై.రామవరంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



సీహెచ్‌సీలో ఎక్స్‌రే, రక్త పరీక్షల యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వై.రామవరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన భారీ రోడ్‌షోలో వారు పాల్గొన్నారు. దేవరమడుగుల గ్రామం నుంచి వై.రామవరం వరకు సుమారు 12 కిలోమీటర్ల దూరం వేలాది మందితోను, వందలాది వాహనాలతోను ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సీఎం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటివరకు చేపట్టిన పలు అభివృద్ధి పనులను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించుకొని, మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు జోగిరెడ్డి, విశ్వమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గుడ్ల హేమామణి, మాజీ జెడ్పీటీసీ పల్లాల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

స్థానిక సీహెచ్‌సీలో ప్రభుత్వం మంజూరు చేసిన మొబైల్ ఎక్స్‌రే ప్లాంటు, బ్లడ్ ఎనలైజర్ యంత్రాలను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు కల్పించి, పేదలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందజేస్తోందన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు అధునాతన యంత్రాలను మంజూరు చేయడం హర్షణీయన్నారు. ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్పంచ్ బాలురెడ్డి. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షులు అబ్బాయి రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్, వైద్యులు చైతన్య, జీవన్,మధులత తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు



చింతరేగుపల్లిలో అనారోగ్యానికి గురైన చంద్రయ్యను పడవ ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న సర్పంచ్ పిట్టా రామారావు



గండి పోశమ ఆలయం వద్ద తగ్గిన గోదావరి నీటిమట్టం

వీఆర్‌పురం: మండలంలోని ప్రజలను ముంపు భయం వెంటాడుతోంది. ఇప్పటికే అధికారులు ముంపు ప్రభావిత గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రహదారులను వరద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు అందుబాటులో ఉంచి పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

- చింతరేగుపల్లిలో అనారోగ్యానికి గురైన చంద్రయ్య అనే వ్యక్తిని సర్పంచ్ పిట్టా రామారావు పడవ సహాయంతో రేఖపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.
- వరద ముంపు ప్రభావిత గ్రామాల్లోని ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించామని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ తెలిపారు. రాకపోకలు నిలిచిన ప్రాంతాల్లో మరపడవలను అందుబాటులో ఉంచామని చెప్పారు. వడ్డిగూడెం-వడ్డిగూడెం కాలనీల మధ్య ఆరు మరపడవలను ఏర్పాటు చేశామన్నారు. చింతరేగుపల్లిలో రెండు, ధర్మతాళ్లగూడెం వద్ద రెండు, ఏపీగూడెం, రామవరం, చొక్కనపల్లి, శ్రీరామగిరి, సీతంపేట, పోచవరం, వీఎస్‌పురం, జీడిగుప్ప ప్రాంతాల్లో ఒకొక్క పడవను ఏర్పాటుచేశామని చెప్పారు.
- ముంపు ప్రభావం ఉండే ప్రాంతాల్లో వరద సహాయక చర్యల నిమిత్తం ఏడు బోట్లను సిద్ధం చేశామని ఎస్ఐ తెల్లం దుర్గా ప్రసాద్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతానికి భద్రాద్రి జలవిహారి, సాయి శబరి, మయూరీ బోట్లను ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. శబరి పరివాహక ప్రాంతానికి ఎస్ఆర్‌బీ హైటెక్, అశ్విని, సాయిశ్రీనివాస్ బోట్లను అందుబాటులో ఉంచామని ఎస్ఐ పేర్కొన్నారు.

పోశమగండి వద్ద తగ్గుముఖం

దేవీపట్నం: ఎగువప్రాంతాల నంచి తరలివస్తున్న వరదనీటిలో ఉగ్రరూపం దాల్చిన గోదావరి శనివారం స్వల్పంగా శాంతించింది. పూర్తిగా నీట మునిగి గండిపోశమ్మ ఆలయం శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ సుమారు మూడు అడుగులు తగ్గింది. వరదనీటిలో ఉన్న ఆలయ గోపురం బయటపడింది.

- దండంగి నుంచి పోశమ్మగండి పూర్తిగా రహదారి బంద్ అవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ఉండడంతో పాటు అమ్మవారి ఆలయం ముంపులో ఉన్నందున భక్తులు ఎవరూ రావొద్దని ఆలయ అధికారులు తెలిపారు.
- దండంగి, దామనపల్లి, పోశమ్మగండి వద్ద గోదావరి పరిస్థితిని దేవీపట్నం ఎస్ఐ కేవీ నాగార్జున సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని ఆయన సూచించారు.

27 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

- జీసీసీ ఎంఎల్ఎస్ గొడౌన్‌కు అప్పగింత
- వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అధికారులు



గిరిజనుల ఆధీనంలో ఉన్న వ్యాన్ ఇదే

అడ్డతీగల: మండలంలోని మల్లవరంమామిళ్లలోని రేషన్ సబ్ డిపో నుంచి ఓ ప్రైవేటు వ్యాన్‌లో రవాణా అవుతున్న 27 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గిరిజనులు పట్టుకున్నారు. ఇక్కడ సబ్ డిపో నుంచి గ్రామంతోపాటు నిమ్మలపాలెం, మామిడిపాలెం గ్రామాలకు కార్డుదారులకు ప్రతి నెలా నిత్యావసరాలు అందిస్తూ ఉంటారు. తరచూ సబ్ డిపో నుంచి బియ్యం పక్కదారి పడుతున్నాయని తెలుసుకున్న మల్లవరంమామిళ్ల, నిమ్మలపాలెం గ్రామస్తులు కాపుకాసి శనివారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు వ్యాన్‌లో 27 బస్తాలు తరలిస్తుండగా అటకాయించి పట్టుకున్నారు. ఆ సమయానికి బస్తాలు వ్యాన్‌లోకి లోడింగ్ చేసిన ఎనిమిది మంది కూలీలు పారిపోయారు. సంబంధిత సేల్స్‌మన్‌ని పట్టుకుని నిలదీసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ కరీం, ఆర్ఐ ఎర్రపుదొర, వీఆర్వో అన్నిక వెంకటరమణ వెళ్లి గ్రామస్తుల ఫిర్యాదు తీసుకున్నారు. ఈ బియ్యాన్ని అడ్డతీగల జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ గొడౌన్‌కు తరలించారు. వ్యాన్‌ను అడ్డతీగల పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. సంబంధిత సేల్స్‌మన్ స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని 6ఎ కేసు నమోదు చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



రైతులకు చెక్కును అందజేస్తున్న ఎంపీపీ రమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి

కొయ్యూరు: సహకార బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వాటిని చెల్లించాలని ఎంపీపీ బడుగు రమేష్‌బాబు కోరారు. వారు తిరిగి చెల్లిస్తే మిగిలిన వారికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయన శనివారం సింగవరం పీఏసీఎస్ కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబుతో కలిసి రైతులకు.రూ.3.3 లక్షల చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పట్టాలు పొందిన వారు ఇక్కడ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. దీని మూలంగా రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది తదితరులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాప్ దగ్ధం

రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం



షార్ట్ సర్క్యూట్‌తో బూడిదైన కిరాణా సామగ్రి

ముంచంగిపుట్టు: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాప్ దగ్ధమైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ముంచంగిపుట్టులో చోటుచేసుకుంది. స్థానిక జీసీసీ డిపో పక్కన కొంచాడా రమేష్ అనే వ్యాపారి కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. అదేరోజు రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో దుకాణం నుంచి భారీగా మంటలు రావటాన్ని స్థానికులు గమనించారు. దీంతో వ్యాపారి రమేష్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. అతడు హుటాహుటిన పరుగులు పెట్టి అక్కడకు చేరుకున్నాడు. స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేశాడు. ఎదురుగా ఉన్న షాప్ వద్ద మోటారు బోరు నీటితో ఆపే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే షాప్‌లోని సామగ్రి మొత్తం ఖాళీ బూడిదయింది. షాప్ పైకప్పు రేకులు సైతం మంట ఉధృతికి బద్దలై ఎగిసిపడ్డాయి. కిరాణా సామగ్రి, సెల్ ఫోన్లు, ఫ్రీజ్, రూ.10 వేలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో ఆర్థికంగా రూ. 3 లక్షలపైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వ్యాపారి రమేష్ బోరుమన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు శనివారం ఉదయం సంఘటన స్థలాన్ని స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. షాప్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిందా, లేక ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



రోగులతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

చింతూరు: వరదల కారణంగా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, ఇతర రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన శనివారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు తక్షణ సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయమందిస్తున్న సర్పంచ్ మంగా బొజ్జయ్య

రంపచోడవరం: బాధిత కుటుంబాలను తక్షణ సహాయం అందించి ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. పంచాయతీ పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు శనివారం వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయమందించారు. మృతి చెందిన కేతమల్ల సూరిబాబు, బలసాని శివప్రసాద్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సహాయం రూ. 10 వేలు చొప్పున అందజేశారు. ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, వార్డు మెంబరు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన ర్యాలీలు

ముంచంగిపుట్టు/హుకుంపేట/రాజవొమ్మంగి: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన అత్యాచారం, హత్యలను ఖండిస్తూ జిల్లాలో ఆదివాసీ, గిరిజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జడేరులో వైద్య శిబిరం

గంగవరం: మండలంలోని జడేరు గ్రామంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల (రాజమండ్రి) ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 34 మందికి రక్త పరీక్షలు చేసినట్టు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేనేయానంద మహారాజ్ తెలిపారు. డాక్టర్ రాయుడు శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తవలసలో వైద్య శిబిరం

అరకులోయ రూరల్: బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మండల కార్యదర్శి రామన్న తెలిపారు.

గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయరూరల్: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర పనులకు రూ.1.20కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చొరవతో జరుగుతున్న అభివృద్ధి పనులపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. టిలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు శెట్టి వెంకటరావు, నాయకులు గోపాల్, సాంబ, రామారావు, గురు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



సూకురులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం, నాయకులు

హుకుంపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజనుల సమస్యలు పరిష్కారమవుతాయని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం చెప్పారు. మండలంలోని సూకురు సచివాలయ కేంద్రంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో 1,198 మందికి ధ్రువపత్రాలు అందజేశారు.జిల్లా వాణిజ్యా విభాగ అధ్యక్షుడు ఒంటుబు శామ్యేల్, సీడీపీవో బాలచంద్రమణి దేవి,ఈవోపీఈఆర్డి అశోక్,మండల అధ్యక్షుడు జి.కొండబాబు,జేసీయస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మెన్ కొండలరావు, సర్పంచ్‌లు దనసాని సత్యవతి, సింహాచలం, మురళి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఆశాజ్యోతి శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి, జ్వర బాధితుల వివరాల నివేదికను అందజేయాలన్నారు. పన్ను వసూళ్లు చేయాలని, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిసున్న సర్పంచ్ పార్వతి తదితరుల

కూనవరం: మండలంలోని కోతులగుట్టలోని జగ్గవరం కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ కారం పార్వతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా అందిస్తున్న సురక్షిత నీటిని వినియోగించాలని సూచించారు. నాయకులు నోముల సత్యనారాయణ, నందికొండ నర్సింహారావు, మందా వెంకన్న, సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కమలబంధ గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ




వై.రామవరంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

డుంబ్రిగుడ: దేశంలో మరెక్కడ లేని విధంగా మన రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సొవ్వ పంచాయతీలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలైన సాగేరివలస, కమలబంధ గ్రామాల్లో జరిగింది. ఎమ్మెల్యే పాల్గుణ ఆయా గ్రామాల్లో 275 గడపలను సందర్శించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలికరించి, ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సాగేరివలస, కమలబంధ గ్రామాలకు రోడ్డు కోసం స్థానికులు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే పాల్గుణ తక్షణమే స్పందించారు. సాగేరి వలస, కమలబంధ గ్రామాలకు కోటి రూపాయలతో రోడ్డు నిర్మాణం, రూ.15.90లక్షలతో తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే పనులు కూడా ప్రారంభించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కారానికే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ శారద, ఎంపీటీసీలు విజయ, వరహాలమ్మ, అరకులోయ మండల పార్టీ అధ్యక్షుడు గాసి, నాయకులు సింహాచలం, సాంబ, మల్లేష్, మండల కన్వీనర్ గణపతి, కృష్ణారావు, నరసింహరావు, ఎంపీడీవో ఉషారాణి, సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నదే

వై.రామవరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగనన్నదేనని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలం కేంద్రంలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించి, మేలైన పాలన అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. రాత్రి గం.9ల వరకు కొనసాగిన ఈకార్యక్రమంలో సుమారు 300 గడపలను వారు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పారదర్శంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే గెలిపించుకుందామన్నారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ మామిడి అప్పారావు, సర్పంచ్ గుడ్ల త్రిమూర్తులు, మండల కన్వీనర్ కరణం కనకరాజు, మాజీ ఎంపీటీసీ హేమామణి, నాయకులు నారాయణరావు, రమేష్, రమణ, డీటీ కె.సుధాకర్, ఈఓపీఆర్‌డీ మధుసూదన రాజు, ఏపీఓ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫొటోగ్రఫీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

అరకులోయరూరల్: మండల కేంద్రంలో వాల్తేర్ ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. గిరిజన జీవన విధానం, వ్యవసాయం, ప్రకృతి అందాల దృశ్యాలను ఫొటోగ్రాఫర్లు చిత్రీకరించారు. వర్క్‌షాపులో 19 మంది వరకు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శి ఎస్.సేతు, శ్రీనివాసరెడ్డి, ఫొటోగ్రాఫర్లు గొల్లపూడి, ప్రభు పాల్గొన్నారు.